# కట్నం లేని పెళ్ళి

వాసంతికి పెళ్ళి కుదిరిపోయింది. పెళ్ళికొడుకు ఇంజనీరు, ఏదో కంపెనీలో వెయ్యి రూపాయల జీతం. బాదర బందీలు లేనివాడు. కొద్దో గొప్పో తండ్రి ఆస్తి పుచ్చుకునే వాడేగాని అతని సంపాదన మీద ఆధారపడ్డ వాళ్ళు ఎవరూ లేరు. పెళ్ళి కొడుకు యోగ్యతలన్నీ విన్న అందరూ వాసంతి అదృష్టాన్ని పొగిడినవారే!

చదువుకున్నవాడు, పెద్ద ఉద్యోగస్తుడు, గొప్ప కుటుంబం ఎంత కట్నం అడుగుతారో ఏమిటో, తూగగలమో లేమో అని బెంగ పెట్టుకున్నారు, ఆడపిల్లవాళ్ళు. కాని, మొగపెళ్ళివారింటికి వెళ్ళి అన్ని విషయాలు మాట్లాడి వచ్చిన వెంకట్రామయ్యగారు మొహం కలకలలాడి పోతూండగా ఆనందంగా మగపెళ్ళివారు కట్నం అక్కరలేదన్నారని చెప్పగానే అందరూ తెల్లపోయారు ఒక్కక్షణం. ఆ తరువాత సంతోషంతో అందరి మొహాలు వికసించాయి. వాసంతి అదృష్టాన్ని ముక్త కంఠంతో ప్రశంసించారు.

"నిజంగా అసలు కట్నం వద్దన్నారుటండీ—" యింక పూర్తి నమ్మకం కుదరక కామాక్షమ్మ ఆరా తీసింది. "అసలేం జరిగిందో చెప్పండీ" అంటూ—

"నిజంగానూ అబద్ధంగానూ ఏమిటి — వద్దన్నారని చెప్పాగా— పాపం వియ్యంకుడుగారు ఎంత మంచివారంటే "అయ్యా—మా పెద్దమ్మాయికి పదిహేను వేలు కట్నం యిచ్చిన మాట నిజమే. కాని యిప్పుడు రిటైరయ్యాను, రెండో పిల్లకు అంత ఇచ్చుకోగల స్థితిలో లేను" అనగానే "నేను మిమ్మల్ని కట్నం అడగలేదు కదండీ" అన్నారు చిరు

నవ్వుతో – తెల్లపోయాను నేను. "మాకేం కట్నాలు అక్కరలేదు – ఎటొచ్చీ ఆడవాళ్ళు సరదా పడ్తారు కనక అత్తగారు ఆడబిడ్డల లాంఛనాలు మీ శక్తికొద్దీ జరిపించండి చాలు. ఏదో మీకున్నదాన్లో ఓ రోజు పెళ్ళి జరిపించండి చాలు" అన్నారే — నిజంగా ఆయన దేముడే అన్పించింది ఆ క్షణంలో. ఈనాడూ యిలాంటి వారున్నారంటే ఇదంతా మన అదృష్టం —ముఖ్యంగా వాసంతి అదృష్టం అనుకో" అన్నారు వెంకట్రామయ్యగారు ఆనందంగా తబ్బిబ్బులవుతూ.

వాసంతి పెళ్ళి ముహూర్తం మరో నెలకే కుదిరింది. ఇంట్లో పెళ్ళి పనులు, బజారు పనులు, – పెళ్ళి హడావిడి ఆరంభమయింది.

"కట్నంలేదు — పిల్లకి కాస్త బంగారమన్నా పెట్టకపోతే ఏం అనుకుంటారోనండీ బొత్తిగా మెడలో కాసున్నర గొలుసు, రెండు జతల గాజులతో కన్యధార పోస్తే ఏం బాగుంటుందండీ – ఓ మూడు వేలుపెట్టి నెక్లెస్ సెట్ పెడదాం" అంది కామాక్షమ్మ — ఆ మాట సబబే అన్పించింది వెంకట్రామయ్యగార్కి.

"కట్నం ఎలాగా వద్దన్నారు — బట్టలు కాస్త ఖరీదువి పెట్టాలి సుమండీ – అప్పగింతలకి కుటుంబాని కంతటికీ పట్టుబట్టలు పెడదాం" – మరో ప్రతిపాదిక – తల ఆడించారు వెంకట్రామయ్యగారు.

"పాపం లాంఛనాలొక్కటే చాలన్నారు — బొత్తిగా ఆడపడుచులకి, అత్తగార్కి నూట పదహార్లిస్తే బాగుంటుందా అమ్మా —" పెద్ద కూతురు చిన్న సందేహం — అవునవును అనుకున్నారందరూ—అత్తగార్కి ఐదు వందలు, ఇద్దరు కూతుళ్ళకి అయిదు వందలు వెయ్యి రూపాయలు లాంఛనాలకి కేటాయించారు.

"వెండి కంచం చెంబయినా యివ్వడం లేదు మనం అల్లుడికి రెండు మూడు మంచి సూట్లు కుట్టిద్దాం నాన్నా" పెద్ద కొడుకు సలహా.

"ఉంగరం మాత్రం చేయించాలి సుమండీ, చిన్నమెత్తు బంగారం పెట్టితీరాలి అల్లుడికి."

"కట్నం వద్దన్నారు - బొత్తిగా పానకం బిందెలు ఇత్తడివి యిస్తే బాగుండదేమో - స్టీలువి కొందాం."

"కట్నం ఖర్చులేదు - అక్కయ్య కంటె మంచి చీరలు కొనుక్కుంటాను నేను" పెళ్ళి కూతురు తెగేసి చెప్పింది. వెయ్యి రూపాయలు చీరలకి శాంక్షన్ చేశారు అందరూ.

"నాన్న.... వాళ్ళింట్లో అందరూ పెద్ద ఉద్యోగస్థులు - ఫారెన్ రిటర్న్‌డ్స్ - పెద్ద కూతురు డాక్టరు - మొగుడు ఫారన్ రిటర్న్‌డు. కొడుకు రెండువేల రూపాయల జీతగాడు. పెద్ద కోడలు సరేసరి పెద్ద కుటుంబంలోంచి వచ్చింది. అబ్బో వాళ్ళింట్లో అంతా మోడర్న్‌గా వుంటారు. భోజనాలకి టేబిల్ మీల్స్ అరేంజ్ చేస్తే బాగుంటుంది కింద కూర్చోరు వాళ్ళు." పెద్ద కొడుకు చెప్పేశాడు.

"వాళ్ళుండేది మూడు పూటలు. మనం కక్కుర్తి పడకుండా నాలుగు రకాల స్వీట్సు, హాట్సు, చేయించాలి. నలుగురు వంటవాళ్ళని మంచివాళ్ళని కుదర్చండి." కామాక్షమ్మ ఆర్డరు జారీ చేసింది.

"నలుగురు వడ్డన వాళ్ళని కూడా మాట్లాడండి నాన్నా. వూరికే వాళ్ళముందు మనం వడ్డనవాళ్ళలా వడ్డించుతే తేలికయిపోతాం" పెద్ద కూతురు.

"విడిది అంటూ ఏవో రెండు గదులు యిస్తే బొత్తిగా బాగుండదు. కింద పడుకోబెట్టడం ఏం బాగుంటుంది. ఏదన్నా గెస్ట్‌హౌస్ చూద్దాం నాన్నా. లేదంటే హోటల్లో రూమ్సు బుక్‌చేద్దాం మూడు పూటలేగదా-" చిన్న కొడుకు.

"అన్నట్టు ఏమండోయ్! ప్రయాణం ఖర్చులు ఒకవైపు యివ్వడం మన రివాజు. వాళ్ళడగలేదుకదా అని ఎగగొడితే మనసులో ఏమనుకుం టారో! అది మాత్రం మరిచిపోకండి."

"వరేయ్ బాబూ! తీరా వేళకి దొరక్కపోవచ్చు. ముందుగానే మంచి కళ్యాణమంటపం రిజర్వ్ చేయించుకోవాలి. ఆ పని చూడు! బొత్తిగా యింత చిన్న యింట్లో పెళ్ళిచేస్తే దర్జాగా వుండదు. వెంకట్రా మయ్యగారు ఆ పని పెద్ద కొడుక్కి పురమాయించారు.

"పెళ్ళయిన వెంటనే పిల్లని తీసుకెళ్ళి పోతామన్నారు కాపురానికి. కట్నం ఎలాగూ లేదు కనక దాని కాపురానికి కావాల్సిన నాలూగూ కొని యియ్యాల్సిందే. వెండి కంచం చెంబు వద్దన్నారు కనుక ఆ డబ్బుపెట్టి స్టీలు సామాను కొనేద్దాం. అలకపాన్పు లేదు కనుక రేడియో అమ్మాయి కిచ్చేసి పంపితే సరి! ఫర్నిచర్‌కి ఓ రెండువేలు ఇచ్చేద్దాం. ఏం కొనుక్కుం టారో వాళ్ళిష్టం! అప్పుడు పైమిండదు. ముందే రెండు డన్‌లప్ పరుపులు కొనండి.." కామాక్షమ్మ లిస్టు చదివి ఆర్డరు జారీచేసింది.

మొత్తానికి అందరి సలహాలు ఆచరణలోకి వచ్చాయి! పెళ్ళిరోజు రానే వచ్చింది. అట్టహాసంగా. ఆడంబరంగా వాసంతి పెళ్ళి ధూమ్‌ధామ్‌గా జరిగిపోయింది. వియ్యాలవారందరినీ ప్రతి క్షణం కనిపెడ్తూ ఏ లోటూ రాకుండా సకల మర్యాదలు జరిపించారు ఆడ పెళ్ళివారు నెస్‌కేప్ కాఫీ - పూటకో రెండు రకాల టిఫిన్లు - నాలుగు రకాల వంటలు. స్వీట్సు— అడుగడుగునా కూల్ డ్రింక్స్ - టేబిల్ మీల్స్ - పెద్ద గెస్టుహౌస్ అంతా విడిదిగా ఏర్పాట్లు, వేణ్ణీళ్ళు చన్నీళ్ళు - యిది లేదు అదిలేదు అనకుండా ఆడపెళ్ళివారు చేసిన ఏర్పాటులు చూసి చాలా మెచ్చుకున్నారు మొగ పెళ్ళి వారు. ఏ అలకలు గొడవలు లేకుండా చాలా బాగా జరిగిపోయింది. ఎంత యినా కల్చర్డ్ ఫేమిలీ అనుకున్నారు ఆడపెళ్ళివారు.

ఫెళా ఫెళా ఉదయం పెళ్ళి —— సాయంత్రం రిసప్షన్ గ్రాండ్‌గా జరిగాయి. తెల్లారి పెళ్ళివారంతా వెళ్ళిపోయారు. ఆ మర్నాడు వుండి పెళ్ళికొడుకు వాసంతిని తీసుకువెళ్ళాడు.

మిఠాయి వుండలు, చలిమిడి చేసి - స్టీలు సామాను పాక్ చేయించి, డన్‌లప్‌లు, బాంబే డైయింగ్ దుప్పట్లు - రెండు పెట్టెలనిండా చీరలు—— రేడియో - ప్రజెంటేషన్లు సామాన్లు రెండు పెట్టెలు——ఫర్నిచర్‌కి రెండు వేల రూపాయల చెక్కుతో వాసంతిని కన్నీళ్ళతో కాపురానికి సాగనంపారు అందరూ.

పెళ్ళివారు వెళ్ళాక ఆడ పెళ్ళివారు కాళ్ళుచేతులు చలిమిడి ముద్దయి కదలలేక నాల్గురోజులు పడకలేసి రెస్టు తీసుకున్నారు.

వెళ్ళవలసిన సామానులు వెళ్ళి - చేర్చవలసిన కుర్చీలు బల్లలు చేర్చి - చెల్లించాల్సిన బిల్లులు చెల్లించి, యధాప్రకారం అయ్యాక వెంకట్రామయ్యగారు సావకాశంగా బిల్లులు లెక్కలు ముందేసుకుని కూడికలు తీసివేతలు ఆరంభించారు.

ఎన్నిసార్లు కూడినా, ఎన్నిసార్లు తీసివేసినా పదిహేనువేలు కట్నం యిచ్చి చేసిన పెద్ద కూతురు పెళ్ళి ఖర్చు ఇరవై రెండు వేలు. దమ్మిడి కట్నం లేని చిన్నకూతురు పెళ్ళికి ఇరవై ఐదువేలు ఎలా అయిందో తెలియక లెక్కలు ఎక్కడ తప్పో అని వెంకట్రామయ్యగారు పాపం లెక్కలు చేస్తూనే వున్నారు యింకా - !

★